**Tauheed kiya hai?**
(Telugu)

# ఏకేశ్వరవాదమంటే...?

మూలం:

**మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది (రహ్మాలై)**

అనువాదం:

**ఎస్.ఎమ్. ఖాద్రి**

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజిష్టర్డ్)**
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002.

**Ekeswara Vadamante..?**
**Tauheed kiya hai? (Telugu)**

TIP Series. No.**202**

| | | |
|---|---|---|
| Written by | : | Maulana Sayyid Abul A'la Maududi (Rah) |
| Translated by | : | S.M. Khadri |

All Rights Reserved with Publishers

| | | |
|---|---|---|
| First Edition | : | December 2007 |
| Copies | : | 2000 |
| **Price** | **:** | **Rs. 12** |
| ISBN | : | 81 - 88241 - 98 - 9 |
| Published by | : | **Telugu Islamic Publications Trust** (Regd.)<br>Sandesha Bhavanam,<br>Lakkadkot, Chatta Bazar,<br>Hyderabad-500 002. India.<br>Phone: 0091 - 040 - 24564583<br>Fax : 0091- 040 - 24576237<br>E-mail: tiphyderabad@rediffmail.com<br>website: www.teluguislamiclit.org |
| Typeset by | : | Geeturai Graphics<br>Lakkadkot, Hyderabad-2. |
| Printed at : | : | Cosmic Printers<br>Lakkadkot, Hyderabad-2. |

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

# పరిచయం

ముస్లిముల్లో సమైక్యత ఏర్పడాలన్నదే ప్రతి ముస్లిమ్ కోరిక. స్త్రీ పురుషులు, ఆబాలగోపాలం, పట్టణవాసి-పల్లెవాసి అనే తేడా లేకుండా ప్రతి వ్యక్తీ, ముస్లిములంతా సమైక్యంగా ఉండాలనే మనస్ఫూర్తిగా కోరుకుంటారు. దానికోసం ఎప్పటి నుండో కృషి కూడా జరుగుతోంది. సమైక్యతా సౌరభాలను వెదజల్లేందుకు, ఆ సమైక్యతా శుభాలను తెలపడానికి ఎందరో రచయితలు, వక్తలు పాటుబడుతూనే ఉన్నారు. అయితే ఇన్ని ప్రయత్నాలు జరుగుతున్నా అనుకున్నది మాత్రం సాధించబడడం లేదన్నది ఆశ్చర్యాన్ని కలిగించే విషయమే.

దీనికి అసలు కారణం ఏమిటి? ఈ సమైక్యతా నినాదాలు ముస్లిముల చెవులకు ఎందుకు ఎక్కడం లేదు? దీనికి కారణం ముస్లిములు సమైక్య వాదులు కారనా? వారినైజంలో సమైక్యతా భావనే లేదనా!! కాదు, కాదు. అలాంటిది ఏదీ లేదు. బాగా ఆలోచించి చూస్తే, ఈ సమాజపు మానసిక పరిస్థితి ప్రపంచంలోని మిగతా సమాజాల మానసిక పరిస్థితికంటే భిన్నమనేదని మనం గ్రహిస్తాం. ఏ విషయాలపైనైతే ఇతర సమాజాలు బాగా మక్కువ చూపుతాయో అవి ఈ సమాజానికి సరిపడని విషయాలు. ఈ సమాజం కార్యోన్ముఖంగా ధర్మాన్ని అనుసరించనప్పటికీ, దీని నైజంలో మతం అనే భావన బాగా నాటుకుపోయింది. అందుకే ఏకేశ్వరోపాసనా రహితమైన విషయం గురించి ఈ సమాజం ప్రభావితం కావడం లేదు. ఉదాహరణకు, కూడు, గూడు, గుడ్డ లాంటి నినాదాలు, సమృద్ధమైన జీవన ప్రమాణాలు ఇతర సమాజాల వారికి ప్రేరణ కలిగించ వచ్చేమోగాని ఈ ప్రాపంచ సుఖ భోగాలు మాత్రం ఈ సమాజం దృష్టిలో గర్వకారణం కాజాలదు.

డాక్టర్ ఇక్బాల్ మాటల్లో..

"ఓ ముస్లిమ్! నా పతనానికి కారణం నీ దారిద్ర్యం ఎంత మాత్రమూ కాదు."



కెరటం సజీవంగా ఉండగలిగేది సముద్రంలోనే. అదే గనక ఒడ్డుకు చేరితే నామ రూపాల్లేకుండా పోతుంది. ఈ యదార్థం ముస్లింలకు బాగా తెలుసు. అయితే వారి భావనా కడలిలో ఆ కెరటం ఎగిసిపడడమే లేదు. ఒకవేళ అది పైకి లేచినా ఒడ్డుకు చేరే లోపలే దాని ఎగిసిపాటు సమసిపోతోంది.

ప్రస్తుతం ముస్లిం సమాజంలో ఉద్భవించే సమైక్యతా కోరిక కేవలం పాశ్చాత్యుల భౌతిక సంస్కృతికి ప్రభావితమయింది. అది పూర్తిగా దాని రంగునే పులుముకుంది. ఇది అసలు ఇస్లామ్ నైజానికి పొసగని కోరిక. అదేకాదు, ఓ విశ్వాసి ధైర్యంగా పలికే మాటలుగా కాకుండా పరిస్థితుల ప్రాబల్యం కారణంగా అపజయానికి లోనై నిస్సహాయులు పెట్టే ఆర్తనాదాల్లా అగుపడుతున్నాయి. విశ్వాసులకు పరమ శత్రువైన ఇబ్లీసు (షైతాను) "ఈ దరిద్రులు ఏమాత్రమూ భయపడేవారు కాదు కాబట్టి వీరి మనస్సుల నుండి ఇస్లామ్ భావనను తుడిచి వేయండి" అనే పన్నాగాన్ని రాజకీయ నాయకులకు నూరిపోస్తున్నాడు. వారు తెలిసో తెలీకో వారి వాగ్దానాలను నమ్మేస్తున్నారు.

నాస్తిక భౌతికవాదం, బహుదైవారాధనా వాదం అనే ఈ రెండు వాదా లకు, పరస్పరం కలిసి ఉండే గుణంలేదు. పైగా ఈ రెండూ విడిపోయే గుణమే మెండుగా కలిగి ఉన్నాయి. దారితప్పి తిరుగుతున్న మనిషిని ఈ రెండు వాదాలు ప్రేమాభిమానాలతో కలిసి మెలిసి ఉండనివ్వక వారిలో పరస్పర ద్వేషాన్ని రగుల్చొల్పుతుంటాయి. అయితే ఇలాంటి ఏ నినాదం, వాగ్దానం వినబడ్డా ముస్లిములు దాని వైపునకు పరుగిడడమే విచారకరం. అలా పరుగెత్తి, పరుగెత్తి చివరకు సొమ్మసిల్లి కూలబడుతూ ఉంటారు. వారి శరీరం ఏ బాధనైతే అనుభవిస్తోందో, ఆ బాధను ఒకరికి చెప్పుకోవడం గానీ, దాని చికిత్స ఏమిటో తెలుసుకోలేక తికమక పడడమోగానీ జరుగుతోంది. కేవలం సమైక్యత కోసమే కలిసిపోవడం అన్నది అర్థంపర్థం లేనిమాట అని వారికి బాగా తెలుసు. అయితే ఓ లక్ష్యం కోసం వారిని ఓ చోట కేంద్రీ కరించడం ఎలా అనేది మాత్రం బోధపడడం లేదు. నేడు ముస్లింల పరిస్థితి ఓ

శిశువులా మారింది. ఆ శిశువు బాధతో తల్లడిల్లి పోతున్నా ఆ బాధ ఎక్కడుందో తెలిపే స్థితిలో ఉండడు. అందువల్ల ఇతరులకే కాదు, తన తల్లి కూడా అతను ఎలాంటి బాధ లేకుండానే ఏడ్చి మారాము చేస్తున్నాడేమో అనే అనుమానానికి లోనౌతుంది. చెడిపోయిన ముస్లింల సాధారణ పరిస్థితి గురించి చెప్పుకునేది కూడా సబబే. మతం పేరిట ఏ మూఢ నమ్మకాలు, భావాలు వారిలో చోటు చేసుకొని ఉన్నాయో వాటిని సంస్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాని వీటన్నింటికి మూలకారణం దురదృష్టవశాత్తు కొన్ని కారణాల వల్ల స్వచ్ఛమైన 'తౌహీద్' (ఏకేశ్వరభావన) వారికి కనుమరుగైంది. ఫలితంగా మతం గురించిన పరిమితమైన, బలహీనమైన చిత్రమే వారి మనోమస్తిష్కాల్లో నాటుకుంది. పాపం వీరు ఓ వంక అమాయకత్వం, అజ్ఞానం రొంపిలో కూరుకొనిపోయి ఉంటే, మరో వైపు ఆధునిక విజ్ఞానం ద్వారా ఉత్పన్నమయ్యే ఆలోచనలు, ఆచరణలు వారిని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఏకేశ్వరోపాసన అంటే ఏమిటో ముస్లిములకు తెలుసు కానీ, అది కేవలం మాటలకే పరిమితం అయి ఉంది. వారి మనస్సుల్లో మాత్రం రకరకాల విగ్రహాలు తిష్ఠవేసుకొని ఉన్నాయన్నది యదార్థం.

దైవగ్రంథం అయిన దివ్యఖుర్ఆన్, దేన్నైతే ఈ మానవ వర్గం విశ్వసించి ఉమ్మతె ముస్లిమా (ముస్లిం సమాజం)గా పిలువబడుతోందో, ప్రస్తుతం దానికి ఎదురౌతున్న సవాళ్ళను దృష్టిలో ఉంచుకొని చూస్తే, ఈ సమాజానికి ఏకేశ్వరోపాసనే సర్వం అన్న యదార్థం బోధపడుతుంది. ఈ ఏకేశ్వరవాదం ద్వారానే చిన్నాభిన్నమైన ముస్లిమ్ సమాజం పరస్పరం ఏకమై పటిష్ఠమైన కోట గోడలా మారగలదు. ఈ విశ్వాసమే వారిలో మరలా జీవం పోసుకుంటే అలనాడు దానికి లభించిన ప్రాభావం, శక్తులు తిరిగి రాగలవు. దాంతో ఈ సమాజం ప్రపంచాన్నే ఆధీనం చేసుకొని శాసించగలదు.

సమాజ కళ్యాణాన్ని, శ్రేయస్సును కోరుకునే ప్రతి వ్యక్తీ, ప్రస్తుతం సొమ్మసిల్లి ఉన్న ఈ ముస్లిమ్ సమాజాన్ని ఉద్ధరించి వారిలో ఏకేశ్వరభావన,



విశ్వాసాన్ని రగుల్కొలిపి వారిలో ఓ కొత్త ఊపిరిని నింపే బాధ్యతను కలిగి ఉన్నాడు. ధార్మిక దృష్టి కోణంతోనూ ఈ ప్రయత్నం పరలోక ముక్తికి సోపానం కాగలదు. అలాగే ముస్లిమేతర సోదరులకు కూడా సత్యధర్మ సందేశాన్నిచ్చే హక్కును నెరవేర్చినట్లౌతుంది. ఇది ప్రతి ముస్లిమ్ బాధ్యత. మీరు చదవబోతున్నది ఇలాంటి ప్రయత్నంలోని ఓ భాగమే.

# ఏకేశ్వరభావన అంటే ఏమిటి?

1989 అక్టోబరు 19న బైరసియా అనే పట్టణంలో ప్రసంగించిన ప్రసంగాన్ని టేపు సహాయంతో పొందుపర్చారు. ఆ ప్రసంగం పూర్తి పాఠం ఇది.

ప్రియ సోదరులారా!

ప్రస్తుత ప్రసంగ శీర్షిక ఏకేశ్వరవాదం అంటే ఏమిటి అన్నది. నేను ముస్లింలకు ఏకేశ్వరవాదం గురించి బోధించడం ఏమిటని మీరు ఆశ్చర్య పోతూ ఉండవచ్చు. దీనికి మీరు బాధపడుతున్నారో, సంబరపడు తున్నారో అది మీరే చెప్పాలి. ఈ సాధారణ పరిస్థితిలో 'అల్ హందులిల్లాహ్'! నేను కూడా ఓ ముస్లిమునే అని మాత్రం చెప్పగలను. నేను పుట్టింది ఓ ముస్లిమ్ కుటుంబంలో. దేవుని దయవల్ల నా తల్లిదండ్రులు కూడా ముస్లిములే. నేను పుట్టినప్పుడే నా చెవుల్లో 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనే కలిమా (సద్వచనం) శబ్దమే పడింది. నేను అల్లాహ్‌ను విశ్వసిస్తున్నాను గనక నేను ఏకేశ్వరవాదిని. అయితే అమలు విషయంలో మాత్రం నేనేదీ చెప్పదలచుకో లేదు. ధార్మిక జీవితంలో నాకూ మరో వ్యక్తికి నడుమ స్పష్టమైన తేడా ఉంది. అతను ఏకేశ్వరవాదాన్ని విశ్వసించకుండా దేవీదేవతలను ఆరాధిస్తాడు. నేను మాత్రం అల్లాహ్‌నే స్మరిస్తాను. అల్లాహ్ నాకు వెసలు బాటును కలిగిస్తే అప్పుడప్పుడు దివ్యఖుర్ఆన్ పారాయణం కూడా చేస్తాను. భగవద్గీతనుగానీ, బైబిల్‌నుగానీ, తౌరాత్ గ్రంథాన్నిగానీ పఠించను. ఈ ఖుర్ఆన్ గ్రంథంలో ఉన్న విషయం ఏమిటి? అన్నది మా ధార్మిక పండితులకు (ఉలెమాలు) మాత్రమే తెలుసు. నేను మాత్రం దాని పారాయణంతోనే సరిపుచ్చుకుంటాను. ఏదైనా ప్రమాణం చేసే అవసరం ఏర్పడితే మాత్రం నేను దైవగ్రంథం అయిన దివ్యఖుర్ఆన్‌పై చేయిబెట్టే ప్రమాణం చేస్తాను. మరింకెవరిపైనా ఒట్టేసుకోను. ఎందుకు? మరి నేను ముస్లింను కదా!

ఎప్పుడైనా ఏ మొక్కైనా మొక్కుకోవాల్సి వస్తే ఏ దేవీదేవతల మందిరా లకో, కోవెలలకో వెళ్ళి మొక్కుకోను. వెళ్ళితే మాత్రం, మొక్కు కోవడానికి 'బుజ్రుగానే దీన్' (గతించిన ధర్మపరాయణులైన పెద్దల) మజార్ల వద్దకు, వారి దర్గాల వద్దకే వెళ్తాను. ఇది నాకు వారసత్వంగా లభించిన ఏకేశ్వరోపాసనా



భావన. అయితే అసలు ఏకేశ్వరోపాసన అంటే ఏమిటి? ఇస్లామ్ ధర్మం కోరేది ఇదేనా అనే ప్రశ్న నన్ను వేధిస్తోంది. బహుశా 'మౌలానా హాలీ (రహ్మాలై)' నాలాంటి ముస్లింల పరిస్థితిని గమనించి వ్యంగంగా రాసిన పద్యపాదాలు ఇందుకేనేమో! ఆయన ఇలా రాస్తున్నారు:

*కరే గైర్ గర్ బుత్‌కి పూజాతో కాఫిర్*

*జో ఠహరాయె బేటా ఖుదాకాతో కాఫిర్*

*ఝుకే ఆగ్‌పర్ బహ్రె సజ్దాతో కాఫిర్*

*కవాకిబ్‌మె మానె కరిష్మాతో కాఫిర్*

*మగర్ మోమినోఁ పర్ కుషాదాహైఁ రాహేఁ*

*పరిస్తిష్ కరేఁ షౌఖ్‌సే జిస్‌కి చాహేఁ....*

(ఒకవేళ ఇతరుల విగ్రహాలను పూజిస్తే కాఫిర్ (సత్య తిరస్కారులు)

దేవునికి సంతానం ఉంది అని అంటే కాఫిర్

ఆరాధనా భావంతో అగ్నికి సాష్టాంగపడితే కాఫిర్

నక్షత్రాల్లో శక్తి ఉందని నమ్మితే కాఫిర్లు. అయితే,

మోమిన్‌లకు (విశ్వాసులకు) బోలెడు వెసలుబాటుంది.

వీరు ఎవరినిబడితే వారిని మొక్కువచ్చు!

దీనివల్ల వారి విశ్వాసానికి, ఇస్లామ్ ధర్మానికీ ఎలాంటి విఘాతమూ కలుగదు)

అసలు తౌహీద్ (ఏకేశ్వరోపాసన) అంటే పూజలు, ఆరాధనలు ఎవరికి చెయ్యమని శాసిస్తోందో ఆ శక్తినే విధేయించడం తౌహీద్. ఆ విధేయత కూడా ఆయనకు భయపడుతూనే పాటించాలి. దైవభక్తిని కలిగి ఉండి ఆ దైవాన్ని సేవించడంతో పాటు విధేయత మాత్రం షైతాను లేదా ప్రస్తుతం మిమ్మల్ని పాలించే పాలకులను విధేయించడం కాదు. వారికి భయపడి మీరు వారిని విధేయిస్తే అది తౌహీద్‌కే వ్యతిరేకం. మీరు ఏకేశ్వరోపాసకులు కాబట్టి దైవాన్నే శాసన నిర్మాతగా భావిస్తూ ఆయన పట్ల భయభక్తులను

ప్రదర్శిస్తూ దైవధిక్కారులకు దాసోహం అనడం ఎంతమాత్రమూ సబబుకాదు. కనీసం తౌహీద్‌కు వ్యతిరేకమై అనాదిగా షిర్క్‌గా పిలువబడే ప్రతి దానికీ దూరంగా ఉండాలి. అయితే సాధారణ తాగూత్‌లు (తామే దేవుళ్ళం, ప్రభువులం అని చెప్పుకునేవారు), షైతానులు కాకుండా కేవలం పాలకులుగా చెలామణి అయ్యే ప్రభువుల గురించి వేరే చెప్పేదేముంది? ఎందుకంటే వారూ, వారిలోకం వేరు; మనం మనలోకం వేరు. మీ దృష్టిలో ఇది ప్రాపంచిక వ్యవహారం. ఇది ధార్మికతకు పూర్తిగా వ్యతిరేకమైన వైఖరి అని అంటారు మీరు.

ఇలాంటి భావనలనే కలిగి ఉన్నందున నేను ఏకేశ్వరోపాసకుణ్ణి అయ్యాను. ఇహపరాల భావన వేరువేరు అని ఒప్పుకునేవాణ్ణి కాను నేను. ముస్లింల ప్రాపంచిక జీవితం ఒకటి, వారి ధార్మిక జీవితం మరోకటి అని భావించను. కాబట్టి నా ధార్మిక జీవితంలో దైవశాసనం తప్ప మరెవరి శాసనం చెల్లదు. ఉదాహరణకు, తలాక్, ఖులా, విరాసత్ వగైరాలు. వీటన్నింటిలోనూ నేను కేవలం దైవాదేశాలనే పాటిస్తాను. నా జీవితంలో నాకెదురయ్యే వ్యవహారాలన్నింటినీ దైవభీతి అనే జ్యోతి వెలుగుతో వెలుగొందేటట్లు ప్రయత్నం చేసుకుంటూ ఉంటాను. ఒకవేళ నేను రాజకీయ వ్యవహారాల్లో పాల్గొనాల్సి వస్తే దైవానికి భయపడే, ప్రస్తుతం అమల్లో ఉన్న శాసనాలను, చట్టాలను అనుసరిస్తూ నిజాయితీగా నడుచుకుంటాను. సందర్భాన్ని బట్టి ఏ రాజకీయ వ్యవస్థయినా సరే ఒకరిని పాలకునిగా గుర్తిస్తే నేను కూడా అతనినే పాలకునిగా గుర్తించి రాజకీయ పార్టీలు నేర్పిన రాజకీయాన్నే అవలంబిస్తాను. కాకపోతే నేను నా నిజాయితీని, సత్యసంధతను వదులుకునే వాణ్ణి కాను. కారణం, నా దృష్టిలో ఇహపరాలు పరస్పరం వేరువేరు విషయాలు కావు. ఇస్లాం ధర్మంలో ఇహం, పరలోకం అనేవి వేరువేరు విషయాలు కావు కాబట్టి నేను నా పద్ధతిలో ధార్మికుణ్ణి. ప్రపంచంలో జరిగే అన్ని కార్యాల్లోను నేను ఆ మార్గం పైన్నే నడుచుకుంటాను. ఎందుకు? నేను ఏకేశ్వరోపాసకుణ్ణి కదా!

నేను ఇప్పటి వరకు చెప్పిన విషయాలను పరిశీలిస్తే, చాలామంది ముస్లిముల ఆలోచనాసరళి ఇదేనని, ఇందులో విశ్వాస సంబంధమైన తేడా



కేవలం ఆచరణకు సంబంధించిందేననే నిర్ణయానికి మీరు వస్తారు. దైవపాలనను విశ్వసిస్తూనే, ప్రజాస్వామ్య పునాదులపై నడిచే రాజకీయాల్లో పాల్గొనేవారిని, వారు దైవ ఏకత్వం లేదా దైవపాలనా విశ్వాసాన్ని త్యజించారని అనడం పొరపాటే. అలాంటిదేదీ లేదు. కాగా వారు అలా అంటున్నారంటే దాని గురించి వారికి అంతగా తెలియదనే చెప్పాల్సి వస్తుంది. ఈ భావన వారికి లేకపోవడం అజ్ఞానం అనే దానికంటే వారి ఆలోచనా సరళిలో తేడా ఉండడమే అని చెప్పవచ్చు. సరైన విశ్వాసంతోపాటు సరైన ఆలోచన కూడా ఉండాలన్నది దీని ద్వారా మనకు అర్థమవుతున్న విషయం. అలా జరగకపోతే విశ్వాసపు డిమాండ్లు పూర్తిగా నెరవేరజాలవు.

ఖుర్‌ఆన్, సున్నత్‌లు మాకు మార్గదర్శకాలని, వాటిని ఎప్పుడూ జవదాటమని మనం చెప్పుకునే విషయాలే. అయితే ఖుర్‌ఆన్, సున్నత్‌ల పరిధిలో ఉంటూనే, ఆలోచనల్లో గల తేడాయే మన జీవన గమ్యాన్ని, దిశను మార్చి వేస్తోంది. ఉదాహరణకు నేనొక ధార్మిక పండితుని ఉపన్యాసాన్ని వింటాను. ఆ ప్రసంగంలో ఆయన పరలోక చిత్రాన్ని వివరించిన తీరుకు నా ఒళ్ళు జలదరిస్తుంది. ఈ ప్రపంచం అశాశ్వితమనీ, ఇక్కడి నుండి ఎంత వీలైతే అంత తొందరగా వెళ్ళి పోవడమే మేలనీ, కేవలం పరలోక చింతనలోనే ఉండిపోవాలని అనుకుంటాను. అలా తలచిన నేను, ఆ పరలోక చింతనలో ఈ ప్రపంచాన్ని షైతాను శిష్యులకు అప్పజెప్పి ఏదో ఓ మూలన కూర్చుని ముక్కుమూసుకొని తపస్సులలో లీనమైపోతాను. ఆ మూలకు మీరు ఏ పేరైనా పెట్టుకోండి. కాని ఖుర్‌ఆన్, సున్నత్‌ల మూసలో పోయబడిన నా మేధస్సు, పరలోక చింతన నన్ను కార్యరంగంలోనికి తీసుకొని వచ్చే ప్రయత్నం చేస్తుంది. చెడును ప్రోత్సహించే వారితో తలపడమని నన్ను ప్రోత్సహిస్తుంది. ఒక రోజు మా గ్రామంలోని నా ఇంటికి ఓ 'సయ్యద్' గారు అరుదెంచారు. ఆయన గొప్ప దైవభీతి పరాయణుడు, ధార్మికుడూనూ. సంభాషణలో ఆయన నన్ను ఉద్దేశించి, 'జమాఅతె ఇస్లామీ వాళ్ళు సున్నత్‌ను అంతగా పట్టించుకోరు' అని అంటుంటారు. మేం దాదాపు రెండు గంటల వరకు ఈ విషయం గురించే చర్చించుకున్నాం. ఆయనకు ఎంత నచ్చజెప్ప జూసినా ఒప్పుకోలేదు.

అదే సమయంలో భోజనాలు చేసే సమయమయింది. అందరం కలిసి భోజనాలకు కూర్చున్నాం. నేను చలికాలంలో నా జీర్ణక్రియ సరిగా ఉండేందుకు గాను రోజూ భోజనం తరువాత ఓ బెల్లం ముక్కను తింటుం టాను. మా వాళ్ళు ఆ బెల్లం ముక్కను కూడా తెచ్చి పెట్టారు. ఆ బెల్లం ముక్కను చూడగానే ఆయన నన్ను మెచ్చుకుంటూ, ''ఓహో! సున్నత్‌ను ఇంతగా పాటిస్తున్నావా?'' అని అడిగారు. ఇది విన్న నేను లోలోన్నే నవ్వు కుంటూ 'సున్నత్ ఆచరణ సర్టిఫికేటు ఓ బెల్లం ముక్కతోనే నాకు లభించిందే' అని అనుకున్నాను. అయితే ఆయన మెచ్చుకోలు నా నైజానికి విరుద్ధమైనది. అందుకని, ఆయనన్నుద్దేశించి, 'అయ్యా! సయ్యద్‌గారూ! సున్నత్ పాటింపు కోసం తీపి వస్తువు తింటే అది పుణ్య ప్రదమైనదే అని నేను భావిస్తాను. కాని ఆ బెల్లం ముక్కతో పాటు రాళ్ళు కూడా నమిలే ధైర్యం కూడా ఉండాలి. నేను బెల్లం తింటున్నందుకు నా గురించి మీరు సదభిప్రాయాన్ని ఏర్పర్చుకుంటే మీ అభిప్రాయాన్ని మార్చుకోండి. నేను మాత్రం నా జీర్ణక్రియ సక్రమంగా జరగాలనే బెల్లం తింటున్నాను' అని చెప్పాను.

అలాగే నా గ్రామం 'బైరసియా'లో ఉన్న అడిషనల్ తహసిల్దారు ఇంటికి ఆయన అతిథిగా వెళ్ళాను. అంతేగాక ఆయన ఓ పోస్టుగ్రాడ్యుయేటే కాకుండా ఓ ధార్మిక పండితుడు కూడాను. మరో వ్యక్తి కూడా ఆయనకు అతిథిగా వచ్చారు. ఆయన ఓ సూఫీ పంథాను అనుసరించే వ్యక్తి. రాత్రిపడుకోబోయే ముందు తహసిల్దారుగారు, 'జమాఅతె ఇస్లామీలో 'రూహానియత్' (ఆధ్యాత్మి కత) అగుపడదు' అనే అంశాన్ని చర్చకు తీసు కొచ్చారు. నేనిచ్చిన సమాధానం ఆయన్ను సంతృప్తి పర్చలేకపోయింది. మేమందరం పడుకున్నాం. పడుకునే ముందు ఏ ఆలోచనలైతే మదిలో మెదులు తుంటాయో ఒక్కోసారి అవి కలగా కూడా వస్తుంటాయి. నేనా రాత్రి ఓ కలను గన్నాను. ఆ కలలో ఓ సభ తీరి ఉంది. ఈ విషయం గురించే చర్చ జరుగుతూ ఉంది. నేను కలలో ఇచ్చిన సమాధానాన్ని మెలుకువలో మాత్రం ఇవ్వలేకపోయేవాణ్ణి. స్వప్నంలో నేనిచ్చిన సమాధానం ఏమిటంటే, 'మన దృష్టిలో ఆధ్యాత్మికత అంటే అల్లాహ్‌యే పూజకు అర్హునిగా



తలచి ప్రతి ఒక్కరి ఆరాధనా విధేయతలను ధిక్కరించి ఓ మూలన కూర్చుండి పోవడం. ఫలితంగా సోకాల్డ్ విధేయతావాదులు మన జీవితాన్నే మార్చివేస్తారు. ఇక పరిస్థితి ఎలా మారిపోయిందంటే ఒక దైవం తప్ప మరెవరి ఆధారం మిగిలుండదు. అప్పుడుగాని మనం దైవాన్ని **"రబ్బనా అఫ్రిగ్ అలైనా సబ్రవ్ వ సబ్బిత్ అఖ్దామనా వన్‌సుర్‌నా అలల్ ఖౌమిల్ కాఫిరీన్"** (ఓ ప్రభూ! మాకు సహనాన్ని ప్రసాదించు, మాకు స్థయిర్యాన్ని కలిగించి దైవతిరస్కారులను జయించే మద్దతును ప్రసాదించు) అంటూ మొరబెట్టుకుంటాం. అప్పుడు దైవదూతల వర్గాల్లో చలనం ఏర్పడడం తథ్యం అని నమ్మండి.'' ఇది కలలో నేనిచ్చిన సమాధానం. నిద్ర లేచిన తరువాత కూడా నాకు ఆ స్వప్నం గుర్తుంది. టిఫిన్ చేసే సమయానా నేను కొంత సంకోచిస్తూనే దాన్ని వారికి వినిపించాను. తహసిల్దారు గారైతే ఆలోచనలో పడిపోయారు, కాని సూఫీ పంథా పెద్దాయన మాత్రం నా ఈ జవాబు విని ఊగిపోనారంభించారు. అలా తలూపుతూ, ఔను! ఇప్పుడుగాని నీవు గాట్లోపడలేదు. అంటే ఆధ్యాత్మికత (రూహానియత్) నీకు లభించింది. ఇక పైకెగరడమే తరువాయి. ఆధ్యాత్మికమైన పరిశుద్ధ లోకంలో విహరించడానికి నీకు రెక్కలు మొలుస్తున్నాయి'' అంటూ ఏదేదో చెప్పనారంభించారు- ఇదండి ఆలోచనల్లోను, భావనల్లోను ఉన్న తేడా- నేనుగాని, ఆయనగాని మా విశ్వాసాల్లో తేడా ఉందని చెప్పలేం. అయితే ఈ ఆలోచన, భావాల తేడాయే మా ఇద్దరిని పరస్పర విరుద్ధమైన దిశల వైపుకు తీసుకెళ్తోంది.

ఇలాగే మరో ఆలోచన, మరో భావన అంతకంటే అధికంగా ఓ ముస్లింను ప్రమాదకరమైన హద్దుకు తీసుకెళ్తోంది. ఏ ముస్లిములోనైనా పరలోక భీతి జనిస్తే అది అతనిని ఏదో ఒక దర్గా వైపునకు, సమాధి వైపునకు పరుగిడేటట్లు చేస్తుంది. ఈ మహాత్ములు చేసే సహాయం లేదా సిఫారసు ద్వారా తన పరలోకాన్ని తీర్చిదిద్దుకోగలను అని తలపోస్తాడు. అతను ఈ మహాత్ములు తమను ఆశ్రయించిన వారి విషయంలో సిఫారసు చేయమని దైవాన్ని అడిగితే వారి మాటను కాదని మన్నించి వేస్తాడని భావిస్తాడు అప్రయత్నంగానే.

టూకీగా చెప్పాలంటే, ఏకేశ్వర విశ్వాసం ఎప్పుడూ ఒక్కలాగునే ఉంటూ వస్తోంది. కాని ఆలోచనల్లో, భావనల్లోని తేడాలే కార్యాచరణ రంగంలో అనేకానేక రూపాల్ని కల్పిస్తున్నాయి. చివరికి మన ముందుకు వచ్చే ఏకేశ్వరవాదాన్ని చూస్తే, అసలు అది ఏకేశ్వరవాదమేనా? అని చెప్పడం కూడా కష్టమైపోతోంది.

మహాశయులారా! రండి, ఆలోచన, భావనల అడవి నుండి మనం బయటకు వచ్చి అసలు ఏకేశ్వర భావన అంటే ఏమిటో కొంత లోతుగా పరిశీలించే ప్రయత్నం చేద్దాం. దాన్ని నమ్మేవారిని అదెలా మారుస్తుందో గమనిద్దాం.

మానవుని ఉనికినే గనక మనం విశ్లేషిస్తే దాన్ని రెండు భాగాలుగా విరగొట్టవచ్చు అని తెలుసుకోవచ్చు. ఓ భాగాన్ని మనం ఆధ్యాత్మికంగాను మరో భాగాన్ని శారీరకమైనది లేదా భౌతికమైనదిగాను గుర్తించగలం. అతని ఆధ్యాత్మిక భాగంలో ఆరాధనాభావం లోతుగా పాతుకొని ఉంటుంది. మనిషి ఆకలిలా, సహజమైనది బలమయిన భావోద్రేకాలు మనిషి తలను ఎవరో ఒకరి ముందు తన అంతర్గత కోరికల కారణంగా మోకరిల్లడానికి పురికొల్పుతూనే ఉంటాయి. సాష్టాంగపడేలా చేస్తాయి కూడా. మనిషికి ఆహారం లభించనప్పుడు అతను ఆకులలములు, కందమూలాలతో తన పొట్టను నింపుకొని ఉదరాగ్నిని చల్లార్చుకుంటాడు. అదే విధంగా మనిషికి మోకరిల్లేం దుకు సరైన స్థానం ఏదీ లభించనప్పుడు అతడు ఏదో ఒక తప్పుడు ఆస్థానం ముందు తన తలను ఆనిస్తాడు. గత్యంతరం లేకుండా అతను అలా చేయాల్సిందే. మనిషి తన మనోఫలకంపై ఓ మోహనాకారుణ్ణి నిలబెట్టు కోవాలని జూస్తాడు. అతని ముందే అతను సాష్టాంగపడతాడు, అతణ్ణే ప్రేమిస్తాడు. అతనిపైన్నే తన సర్వస్వాన్నీ ధారబోసే ప్రయత్నం చేస్తాడు. ఈ భావన ఉండడం వల్లనే మతం అనేది ఉనికిలోనికొస్తుంది. మనిషి దాన్ని తన మనస్సు నుండి వేరుపర్చజాలని బలీయమైన భావోద్రేకమది. కమ్యూనిస్టు రష్యా ఈ భావోద్రేకాన్ని అణచడానికి చేసిన పరిశోధనలన్నీ ఇన్నీ అన్నీకావు. తన శక్తినంతా ఉపయోగించి చూసింది కూడా. అయినా దాన్ని రూపుమాపలేక పోయింది. ఏ రష్యా అయితే, “మేము దేవుణ్ణి మా పొలిమేరల ఆవలకు తరిమి వేశాం” అని సవాలు విసిరిందో, అదే రష్యాపై హిట్లరు విరుచుకు పడినప్పుడు



చర్చీల, మసీదుల ద్వారాలన్నీ తెరుచుకున్నాయి. ప్రజలు దైవానికే మొర బెట్టుకోనారంభించారు. ప్రస్తుతం అక్కడ మతం భావన ప్రత్యేకంగా ఏకేశ్వర భావనగా మరింత బలీయమైపోయింది.

ప్రస్తుతం దాని వివరాల్లోనికి వెళ్ళే సమయం కాదిది. దాని అవసరం కూడా లేదు. ఇప్పుడు నేను మీ ముందు ఉంచే విషయం మాత్రం, ఆరాధనా భావం మనిషి నైజంలోనే దాగుందనీ, ప్రతి మతంలోనూ ఆరాధనకు సంబంధించిన కొన్ని రూపురేఖలు, నియమ నిబంధనలు కొంత తేడాతో ఉమ్మడిగా ఉన్నాయని చెప్పడం కోసమే. అయితే ఇస్లామ్ మాత్రం ఈ రూపురేఖలన్నింటినీ ఓ హద్దులో ఉంచి ఆ భావోద్రేకాలను ఒకే ఒకని వైపునకు త్రిప్పుతోంది. మనిషి ఒకరి ముందు మోకరిల్లాలని భావిస్తాడు. ఒకరి ముందు సాష్టాంగపడాలని కోరుకుంటాడు. ఇస్లామ్ అనేదేమిటంటే నీ ఈ కోరిక సబబైనదే అయితే, నీ తలను ఒకరి ముందు వంచాలనుకుంటే అది నీ కంటే మహోన్నతుని ముందే వంచు. నీవు ఉత్కృష్ట సృష్టివి. భూమండలం నుండి ఆకాశం వరకూ నీకు అగుపడే ప్రతి వస్తువూ నీకంటే తక్కువ స్థాయినే కలిగి ఉంది. ఇవన్నీ సృజించబడింది నీ కోసమే. అవన్నీ నీకు లోబర్చబడినవే. కాబట్టి నీ శిరస్సు ఈ వస్తువులన్నిటినీ సృజించిన దైవం ముందే వంగాలి. ఆయనే నిన్ను పుట్టించాడు, పోషిస్తున్నాడు. అందుకే ఉత్తమాంగమైన నీ శిరస్సు తప్పకుండా ఆయన ముందే వంచాలి. నీకు లభించిన వరాలన్నీ, వనరులన్నీ నీకు దూరమై పోయిననప్పుడు నీవు ఒకరి ముందు చేతులు జాపుతావు. నీవు కావాలని చేతులను జాచవు. అదే అప్రయత్నంగా వాటంతటదే పైకి లేస్తాయి. దైవం చెప్పేదేమిటంటే, నిజమే అది నీ నైజం కోరుకునే విషయం. అయితే నీవు ఆ చేతులను జాచి అర్థించేది ఎవరిని? నీవే బల వంతుడివి. నీకు సహాయపడే శక్తి ఇంకెవరికి ఉంటుంది? నీ కోరికలను తీర్చే, నీ మొక్కుల్ని తీర్చే శక్తి ఎవరికుంది? అలాంటి శక్తి గలవాణ్ణి నేనొక్కడినే. నేనే మీకు సహాయన్నందించగలను. నేనే మీ మొక్కుల్ని తీర్చేవాణ్ణి అని అంటాడు సృష్టికర్త అయిన అల్లాహ్. నాకు తప్ప మీరు ఎవరి ముందైతే సాష్టాంగపడుతున్నారో, చేతులు జోడిస్తున్నారో వారివద్ద మీకివ్వడానికి ఏదీ లేదు. పైగా అలా చేస్తూ మీ చేతుల్ని అగౌరవానికి గురిచేస్తున్నారు. మీకు ఆ చేతులు ప్రసాదించిన నాకు కృతఘ్నుత జూపు తున్నారు. అందరూ మీలాగే

అవసరార్థులు. ఆ అవసరాలు మీకంటే వారికే అధికం. అలాగే మీ అంతర్గత భావోద్రేకాలు ఒకరి కోసం త్యాగం చేయమని ప్రోత్సహిస్తాయి. మీకు వరాలిచ్చే వాని కోసం ఉపవాస దీక్షను పూనమని ప్రేరేపిస్తాయి. మీ ఈ అంతర్గత భావోద్రేకాలు సరైనవే. కాని ఇస్లామ్ ధర్మం చెప్పేదేమిటంటే, మీ విశ్వాసం, మీ కృతజ్ఞతాభావాల దిశ మరే వైపునకు కాకుండా కేవలం సృష్టికర్త అయిన అల్లాహ్ వైపుకే మళ్ళాలి అని.

ఒకరికి అంకితం అయిపోవాలనే ఆకాంక్ష మీ హృదయాల్లో పొడసూపుతుంది. పొడసూపే భావోద్రేకాలు పూర్తిగా సక్రమమైనవేనని అంటాడు ఇస్లాం దైవం. అయితే మీ విలువైన భావోద్రేకాలకు లక్ష్యం మరెవరో కాదు, ప్రపంచంలో ఒకరికి అంకితం అయిపోయేందుకు మీ భావోద్రేకాలకు తగినవాడు ఎక్కడా కానరాడు. దానికి నేనొక్కడినే అర్హుణ్ణి. అలాగే, మీరు నన్ను చూడలేరు. అయితే నా ప్రకాశం కోసం నేను ఓ ప్రదేశాన్ని కేంద్రంగా చేశాను. మీరు దాని చుట్టూ ప్రదిక్షణలు (తవాఫ్) చేసి మీ అర్పణాభావాన్ని, అంకిత భావాన్ని సంతృప్తి పర్చుకోండి. అదే విధంగా, ఒకరికోసం మీ ధన ప్రాణాలను అర్పించమని అంటుంది మీ నైజం. ఇది కూడా ఎంతో మేలైన కోరికే. అయితే దానికి అర్హుడు మిమ్మల్ని పుట్టించినవాడు, మిమ్మల్ని పోషించేవాడే. మీరు మీ కృతజ్ఞతాభావాన్ని కేవలం ఆయన కోసమే పరిమితం చేయాలి. ఆయన్ను ఆరాధించాలి. తప్పకుండా ఆరాధించాలి. దీన్నే షేక్ సఅదీ తన పద్య పాదాల్లో ఈ విధంగా చెబుతున్నారు:

“మేఘాలు, గాలి, సూర్యచంద్రాదులు వగైరాలన్నీ వాటి కార్య నిర్వహణ ద్వారా మీకు భుక్తిని ప్రసాదించడానికి తమ తమ పనుల్లో నిమగ్నమై ఉన్నాయి. ఇవన్నీ నీ కోసమే దైవాదేశానికి లోబడి పరిభ్రమిస్తున్నాయి. నీ వొక్కడివే విధేయించకపోవడం ఎక్కడి న్యాయం?”

ప్రపంచ మతాలన్నీ దైవాన్ని నమ్ముతాయి. ఆరాధనా నియమాలను సూచిస్తాయి. అలాగే శుచీ శుభ్రతకు సంబంధించిన స్వరూప స్వభావాలు ప్రతి మతంలోనూ ఉన్నాయి. ప్రతి మతంలోనూ మనిషి తాను నమ్మిన దైవం ఎదుటే తలను వంచుతాడు, సాష్టాంగపడతాడు. అతనిపేరు మీదనే బలులిస్తాడు, అతని కోసమే ఉపవాస వ్రతాలను పాటిస్తాడు. మొక్కులు



మొక్కడం, నైవేద్యం పెట్టడమూ జరుగుతుంది. ఇస్లామ్ వీటన్నింటినీ ఒకే ఒక దైవం కోసం ప్రత్యేకిస్తుంది. ఇస్లామ్ ధర్మబోధనల ప్రకారం ఈ పర్వతాలు, ఈ నదీనదాలు, ఈ సూర్యచంద్రాదులు, ఈ పాలనిచ్చే పశువులు, కరిచి బాధించే ఈ పాములూ తేళ్ళు అన్నీ నీకంటే అల్పమైనవే. వీటన్నింటిని నీ సేవ కోసమే సృష్టించడమయింది. వీటిలో దేని ఎదుటనైనా సరే నీ చేయి చాచకూడదు. మీ పవిత్రమైన తలలు వాటి ముందు వంచడం మీకు అగౌరవాన్ని తెచ్చిపెడతాయి. ఇది కృతఘ్నత, నీచమైన కార్యం, ‘షిర్క్’ (బహుదైవారాధన) అంటోంది ఇస్లామ్. దైవదూతల చేత నీకు సజ్దా చేయించాం. కాబట్టి నీ శ్రేష్ఠాంగం ఒకరి ముందు ఏమాత్రం వంచడానికి వీల్లేదు. అది మీ సృష్టికర్త సమక్షంలోనే వంగాలి. మీరే గనక పూర్తి ఏకాగ్రతతో మీ ఏకైక దేవుని ఎదుటే వంగినట్లయితే మీరు కూడా సాటిలేనివారుగా అయిపోగలరు.

ఈ కోణంతో, (అంటే ఏకేశ్వరోపాసనా పరిధికి సంబంధించిన కోణంతో) ముస్లిముల ఓ పెద్ద సంఖ్య ఏకేశ్వరోపాసనా డిమాండ్లను నెరవేరుస్తోందని అనుకుంటే అది సంతృప్తికరమైన విషయంగానే భావించవచ్చు. ఇందులో ఎలాంటి విభేదానికి తావు లేదు. ఈ విశ్వాసం, ఆరాధనా పరుధుల్లో వారు త్రికరణ శుద్ధిగా ఆ డిమాండ్లను పరిపూరిస్తున్నారు. అయితే మేం ఇంతకు ముందు చెప్పినట్లు మనిషి ఉనికికి సంబంధించిన మరో కోణం కూడా ఉంది.

మనిషి సామాజిక జీవితంలోని ఓ అంశం. అతను సంఘజీవి. అతను పుట్టింది ఒంటరిగానే అయినా ఒంటరిగా మాత్రం జీవించలేడు. ఎప్పుడైతే ఒకరికి ఇద్దరౌతారో అప్పుడు ఓ సంఘం లేదా సమాజం ఏర్పాటు ప్రారంభం అవుతుంది. ఆ తరువాత సామాజిక డిమాండ్లు కూడా ఎదురవడం ప్రారంభిస్తాయి. పరస్పర ప్రేమానురాగాలు, సహాయ సహకారాలు, సానుభూతి, దయ, త్యాగం, చిత్తశుద్ధిలాంటి సుగుణాలు ఓ మేలైన సమాజానికి చిహ్నాలు. అదే కాకుండా మరో అంశం నియంత్రణ అనేది. ఇది సామాజిక జీవితానికి ఎంతో అవసరమైనది. మనిషి సామూహిక అవసరాల కోసం అతని హక్కుల్ని, పరధుల్ని నిర్దేశించి వాటిని బలవంతంగా అమలు చేయించే ఓ శక్తి తప్పకుండా ఉండాలి. అలాంటి శక్తి ఏదీ లేనప్పుడు అతని అమాయకత్వం, అతని కోరికలు, అతని స్వార్థం ఇతరులకు హాని కలిగించవచ్చు. కఱ్ఱగల వానిదే

బఱ్రె అన్నట్లు శక్తివంతుడు ఎవరైనా, ముకుత్రాడు లేని ఆంబోతు. ప్రతి చేనులోనూ చొరబడి మేసినట్లుగా, అతన్ని అడ్డుకునేవారు లేనట్లుగా ప్రవర్తిస్తాడు. ప్రజల ధన ప్రాణాలకు, మానమర్యాదలకు రక్షణంటూ ఉండదు. దీన్నే విశృంఖలత్వం లేదా Anarchay అని అంటారు. చరిత్రలో ఈ విశృంఖలాన్ని ప్రదర్శించని ఏ రాజూ మనకు కానరాడు. ప్రతికాలంలోనూ నాగరిక మానవుడు ఏదో ఒక శక్తికి లోబడే ఉన్నాడు. ఏదో ఒక పాలనాశక్తి అతణ్ణి తన శక్తినుపయోగించి నిర్ణయించబడ్డ హద్దుల్లోనే ఉంచేది. ఆ పాలనాశక్తి ఆ మానవ సమాజం నుండే ఉద్భవించినా లేదా బయటి సమాజాల నుండి వచ్చి ఆ సమాజాన్ని బలవంతంగా వశపర్చుకున్నా సరే. అంతకంటే విశృంఖలత అనేది మరేదీ ఉండబోదు.

సామ్యవాద 'తసవ్వుఫ్' (ఊహా లోకంలో విహరించే భావజాలం) అయితే తప్పకుండా ఓ పరిస్థితికి సంబంధించిన కలను చూయించింది. ఆ కల లేదా స్వప్నం ఇది:

"బలవంతంగా ఆర్థిక సమానత్వాన్ని నెలకొల్పగలిగితే మనిషి జీవన ప్రమాణాలు తప్పకుండా మారిపోతాయి, స్వార్థం అనే తప్పుడు కోరికలు మటుమాయమవుతాయి. ఆ తరువాత అతనికి ఎలాంటి కోరికలుగానీ, అవసరాలుగానీ ఉండబోవు; ఆ పిదప శక్తినుపయోగించి మనిషిని తన హద్దుల్లో ఉంచే ప్రభుత్వ పాలన దానంతటదే పండుటాకులా రాలిపోవడం తథ్యం."

అయితే ఇది ఊహా జనితం. నేను సామ్యవాదాన్ని 'తసవ్వుఫ్' అని అనడానికి కారణం, అది ఊహాలోకంలో విహరించే భావన కాబట్టి. కార్యచరణకు, దానికి సబంధమే లేదు. పైగా సామ్యవాదం రుజువు చేసిందేమిటి? మనిషి ప్రకృతి సిద్ధంగా తనపై ఓ పెత్తందారు తప్పకుండా ఉండాలని కోరుకుంటాడన్నది.

స్త్రీ నైజం ప్రకారం ఆమెకు తన సంరక్షణ కోసం ఓ సంరక్షకుడు కావాలి; ఆమె సుఖంగా ప్రశాంతంగా తలదాచుకునేందుకు ఓ కప్పు అనేది ఉండాలి. ఆ కప్పునే భర్త అని అంటాం మనం. ఓ భార్యకు భర్త అండగా ఉండి ఆమె అతని ఆచ్ఛాదనలో నిశ్చింతగా జీవితం గడుపుతూ అతణ్ణే విధేయిస్తుంది. అలాగే ఓ సొసైటీకి కూడా ఓ ఆచ్ఛాదన అనేది ఎంతైనా



అవసరం. అనాగరికురాలు లేదా ప్రగతి సాధించిన స్త్రీ ఏదో ఓ రకంగా తన జీవితాన్ని భర్త లేకుండా కూడా నెట్టుకురాగలదు. కాని మానవ సమాజం ఎవరో ఒకరు పాలకుడు లేకుండా ఒక్క రోజు కూడా మనగజాలదు. అలాంటి ఏ ఒక్క ఉదాహరణ కూడా ప్రస్తుత కాలంలోగాని, గతించిన చరిత్రలోగాని మనకు కానరాదు. మరే మానవ మస్తిష్కం కూడా అలా జరిగిందని అనుకోదు. మనిషి యొక్క ఈ సామూహిక అవసర పరిపూర్తి, వివిధ కాలాల్లోను, వివిధ ప్రాంతాల్లోను, రకరకాలుగా జరుగుతూ పోయిందే.

సోదర మహాశయులారా! నియంత్రణా బలం కలిగి ఉండే శక్తి అనేది మనిషికి ఎంతైనా అవసరం అని మనం ఒప్పుకున్నప్పుడు, ఆ శక్తిలో ఉండే సుగుణ సంపద ఎలా ఉండాలి అన్నది కూడా మనం ఆలోచించాలి. ఆ శక్తి భావోద్రేకాలకు అతీతమైనదై విజ్ఞానంలో సాటిలేనిదిగా ఉండాలి. అలాగే అది మెండైన శక్తియుక్తులు కలిగి పక్షపాత రహితమైనదిగాను, తన ఇష్టం తప్ప బాహ్య ప్రోత్బలాలకు లొంగనిదిగాను, అది ఇచ్చే తీర్పు లొసుగులు లేకుండా అందరికీ ప్రాధాన్యమిచ్చేటట్లుగాను ఉండాలి వగైరా వగైరా.... ఈ హోదా ఎవరికి దక్కుతుందో రాజకీయ భాషలో చెప్పాలంటే అతనే పాలనాధికారి, ప్రభువు. రాజకీయ శాస్త్రం వెలుగులోనికి వచ్చిన తరువాత పాలకుడు అనే పదానికి ఈ నిర్వచనం ఇచ్చారు. అయితే, అంతకు పూర్వపు సమాజం దాని రాజకీయపు పాలకులు లేకుండానే నడిచిందని దీనిభావం కాదు. తెగల వ్యవస్థలు నడచినప్పుడు ఆ హోదా ఆ తెగ సర్దారుకే ఉండేది. ఆ తరువాత జమీందారీ, జాగీరుదారీ వ్యవస్థ వచ్చింది. ఆ పిదప చర్చి వ్యవస్థ నెలకొల్పబడింది. అప్పుడు చర్చ్ రాజు కలిసే ఈ వ్యవస్థను నడిపేవారు. ఆ తరువాత చర్చ్‌ని కాదని కేవలం రాజే దాన్ని కైవశం చేసుకున్నాడు. ఆ తరువాత ఆ స్థానం రాజరికానికి దక్కింది. ఆ తరువాత నియంతృత్వం ఉనికిలోనికి వచ్చింది. ఈ అన్ని వ్యవస్థల్లోనూ ప్రతి పాలకుని తీర్పు అంతిమ తీర్పే. దానికి వ్యతిరేకంగా ఎవ్వరూ నోరు మెదపడానికి వీల్లేదు. ఆ తీర్పుకు అప్పీలు కూడా ఉండదు. దాని పేరే ప్రస్తుత ప్రజాస్వామ్యం. ఈ సెక్యులర్ ప్రజాస్వామ్యంలో జరుగుతున్నదేమిటి? ప్రజల పేరు చెప్పుకొని ఆడే ఆటలు ఎలాగుంటున్నాయి? ప్రజల్ని ఎలా ఉపయోగించుకోవాలో వారిని అలా ఉపయోగించుకుంటున్నారు. ప్రజలు ఎవరినైతే పాలనాధికారిగా ఒప్పుకున్నారో

ఆ వ్యక్తికి ఒకే ఒక రోజు రాచరికం తరువాత ఎలాంటి అధికారాలు ఒనగూడుతున్నాయి? అందుకేనేమో డా॥ ఇక్బాల్ 'ఇబ్లీసు' మాటల్లో ఇలా అన్నారు:

"మేము రాచరికానికే ప్రజాస్వామ్య దుస్తుల్ని తొడిగించాం
అప్పుడుగాని మనిషి తానేమిటో తెలుసుకోలేదు."

మొత్తానికది ఓ వేరే కథ. ప్రస్తుతం చెప్పదలచుకున్న దేమిటంటే, ఈ ప్రజాస్వామ్య యుగంలో సైద్ధాంతికంగా ప్రజలకే పాలకుల హోదా ఉంది. ఓ వైపు 'హిప్పొక్రేటస్', 'ప్లాటో', 'అరిస్టాటిల్' లాంటి మహా మేధావులు ఉండగా, ఇంకోవైపు నూటొక్క తెలివిలేని మూర్ఖులూ ఉన్నారు. ఈ నూటొక్క మంది మూర్ఖుల తీర్పే చిట్టచివరి తీర్పు. దాన్ని మార్చే అధికారం ఎవరికీ ఉండదు. ఈ కారణం చేతనేమో రాచరిక హయాంలో చాలామట్టుకు భట్రాజులు రాజును అంటిపెట్టికొని ఉండేవారు. రాజు వెలువరించే తీర్పులపై వారి ప్రభావం ఎంతైనా ఉండేది. అచ్చం అలాగే, ప్రజాస్వామ్య ప్రభువులు, అంటే రాజకీయ నాయకులు ఓటర్లను అంటిపెట్టుకొని ఉంటారు. తమ పొగడ్తల్లో వారిని భట్రాజుల్లా పొగుడుతూ ఉంటారు. లేదా సమయం వచ్చినప్పుడు వారితో అంటుకుపోతారు. వీరు ప్రజల తీర్పును మార్చే కళలో ఆరితేరిన వారు. ఆదేశ పాలన అన్నది మనిషి నైజంలోనే దాగుంది. అది అతని అవసరం కూడా. అలా జరగకపోతే ఓ మనిషి మరో మనిషి పాలిట శాపంగా మారిపోగలడు. అయితే ఇప్పుడు ఉద్భవించే ప్రశ్నల్లా, ఈ సామాజిక పశువును హద్దులలో ఉంచే హక్కు ఏ ప్రాతిపదికన మనిషికి లభించిందన్నది. దీనికి తోడు మరో విషయాన్ని కూడా గుర్తుంచుకోవాల్సి ఉంటుంది. అధికారం చేలాయించడం, ప్రజల తలల్ని తమ ముందు వంచేటట్లు చేయడంలో ఎంతో మజా ఉంది. అంతకంటే రుచికరమైన విషయం మరేదీ నేటికి కనుగొనబడలేదు. ఒక సోదరుడు మరో సోదరుని గొంతుకొసేటంతటి తీపైన దాహం ఇది. ఓ కుమారుడు తన కన్నతండ్రికి ఎదురు తిరిగేటట్లు చేసింది కూడా ఇదే. దానికోసమే మనిషి సూర్యదేవునికి ప్రతినిధి అయ్యాడు. ఒకరు ఫిరౌనుకు ఇంకొకరు చంద్రునికి, మరొకరు సూర్యునికి ప్రాతినిధ్యం వహిస్తూ సూర్యవంశజులు, చంద్రవంశజులుగా మారారు. ఇంకొకడు ఊరూపేరులేని సోకాల్డ్ దేవునికి ప్రతినిధి అయి



కూర్చున్నాడు. మొత్తానికి దైవదాసులపై అధికారాన్ని చెలాయించే అధిక దాహం మనిషి చేత తన ఇష్టమొచ్చిన పనులన్నింటినీ చేయించింది. రక్తపు టేరుల్ని పారించింది. భూమండలాన్ని మొక్కలు చెక్కలుగా చేశాడు మనిషి. ఓ జాతి మరో జాతిపైకి కాలుదువ్వింది. జాతులకు జాతీయ మహోన్నత అనే మత్తును ఎక్కించిందీ అధికార దాహం. ఇంతకంటే పెద్ద ఉపద్రవం ఏమిటంటే, సత్యం కోసం కృషి జరిపినపుడల్లా, దైవదాసుల్ని దాసుల దాస్యం నుండి విముక్తిని కలిగించే ప్రయత్నాలు జరిగినప్పుడల్లా ఇలా చేసిన వారిని కూడా శత్రువులుగా పరిగణించి వారి పట్ల దురుసుగా ప్రవర్తించారు.

పోనుపోను ఇలా ప్రజా ప్రభుత్వ హయాం వచ్చిన తరువాత కూడా ఆ రెండు అంశాలే మరింత స్పష్టంగా ముందుకొచ్చాయి. ఒకటి, ఇతరులకు అధికారం చెలాయించే హక్కు ఎవరిచ్చారు? ఎందుకిచ్చారు? అన్నది. రెండవది ఎవరైతే అధికారాన్ని చెలాయించే హక్కును కలిగి ఉంటాడో అతను సకల లోపాలకు అతీతుడైనవాడై పవిత్రునిగా ఉండాలన్నది. మొదటి విషయం గురించి నిర్ణయించబడిన విషయం ఏమిటంటే, ప్రతి మనిషినీ అతని తల్లి స్వతంత్రంగానే జన్మనిచ్చింది. అతనిపై మరెవరి ఇష్టాఇష్టాలూ నడవడానికి వీల్లేదు. అతను సమాజంలో గౌరవనీయుడైన, పోపు అయినా, మరే రాజైనా, మరే బూటకపు దేవుడైనా సరే. మరి వారి ఇష్టాయిష్టాలు ఎలా నడవాలి? వాటి రూపం ఒకదానికంటే ఎక్కువే. మనిషి ఆలోచించిన రెండవ విషయం ఏమిటంటే, ఆ పాలనాధికారంలోని లోపాల్లో పరస్పరం తేడా ఉంది అన్నది. కాబట్టి పాలకుడు సర్వలోపాలకు అతీతుడై ఉండాలి. వారికి అవసరం ఉంది కాబట్టి, లోపాలకు అతీతుడు అని అనుకున్న వ్యక్తికి వారు ఆ పాలనాధికారాలను కట్టబెట్టారు. అసలతను అలాంటి వాడేనా కాదా? అన్నది మరో విషయం. ఇటలీని ముస్సోలినీ పాలించేటప్పుడు ప్రతిచోటా 'ముస్సోలిని తప్పు చేయడు' అనే రాతలు కనబడేవి. అంతకు పూర్వ చర్చి వ్యవస్థ నడిచేటప్పుడు కూడా ప్రతిచోటా 'పోపు తప్పు చేయడు' అని రాసి ఉంచేవారు. తప్పులు చేసేవాడు పాలకుడు కాజాలడు అనే ఘోషిస్తోంది మానవ మేధస్సు. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థ 'రూసో' ఇచ్చిన కానుక. ప్రజల్ని పాలకులుగా చేసినప్పుడు కూడా దాని ముందు ఓ సమస్య వచ్చిపడింది.

సామాజిక పశువుగా పిలిచే ఈ మనిషిని పవిత్రునిగాను, పొరపాట్లకు అతీతునిగాను ఎలా గుర్తించాలి. లేదా గుర్తింపజేయాలి? అన్నదే ఆ సమస్య. కాబట్టి ఓ కొత్త సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారు. అదే సాధారణ ప్రజా కోరిక' (Common will) సిద్ధాంతం. దీని ప్రకారం మనిషి పాప రహితుడు అని అనుకున్నారు. ఇదంతా ఎందుకు జరిగిందంటే, ఏ రాజకీయ వ్యవస్థలోనూ పునాదిగా ఉండేవాడు పాలకుడే. అతణ్ణి గుర్తించకుండా ఎలాంటి రాజకీయ వ్యవస్థ ఉనికిలోనికి రాజాలదు. అలాగే పాలకుణ్ణి లోపరహితుడు (Mister Clean)గా ఒప్పుకోక తప్పదు. నేను నా బాల్యం నుండే, **సుబ్బూహున్, ఖుద్దూసున్ రబ్బునా వరబ్బుల్ మలాయికతి వర్రూహ్** అనే స్తోత్రాన్ని చేస్తూనే వస్తునానని ఒట్టేసుకొని మరీ చెబుతున్నాను. నేను దాని అర్థాన్ని కూడా ఎరుగుదును. కాని రాజకీయ వ్యవస్థలోని ప్రభువుకు ఉండాల్సిన తప్పనిసరి సుగుణాల గురించి తెలుసుకున్నప్పుడు గాని నాకు సుబ్బూహ్ (స్తోత్రాలకు అర్హుడు) ఖుద్దుస్ (ఎంతో పరిశుద్ధుడు) అనే పదాలకు అర్థం తెలిసిరాలేదు. సాధారణ ముస్లిముల్లాగే నేను కూడా నాకు తెలియకుండానే, ఏ మాత్రం ఆలోచించకుండా రాజులు, భట్రాజు పొగడ్తలకు పొంగిపోయి బహుమతులు ప్రదానం చేసినట్లే, అల్లాహ్ కూడా తనను స్తోత్రించే వారి స్తోత్రాలకు ఆనంద పడిపోతాడని, బహుకరిస్తాడని అనుకునేవాణ్ణి. నా దాసులు ఎంత మంచివారో, కాబట్టే నన్ను అలా స్తోత్రిస్తున్నారని, నన్ను సుబ్బూహ్‌గాను, ఖుద్దూస్‌గాను కొనియాడుతున్నారు అని అనుకుంటాడేమోనని భావించేవాణ్ణి. దైవం పట్ల గల ఈ భావనను మనిషి మదిలో మెదిలే భావనే అని నేననుకునేవాణ్ణి. అయితే ఎంతో లోతుగా ఆలోచించిన తరువాత గాని నా హృదయం నుండి ఉప్పొంగి పొరలే విశ్వాసం ఏమిటో అర్థం కాలేదు. దేవునికి మన స్తోత్రాలు, పొగడ్తలు ఎంతమాత్రమూ అవసరం లేదని, పైగా ఆయన సుగుణ సంపదలు కావలసింది మనకే అన్నది. మన అవసరం ఆయనకేమాత్రం లేదు. ఇదే ప్రపంచంలోని అతిపెద్ద యదార్థం. ఇదే మన అతిగొప్ప అవసరం. ఆయన సుగుణాలేమిటో తెలుసుకోలేని స్థితిలో ఉన్నాం. ఆ సుగుణాలేమిటో తెలుసుకునే మాధ్యమం కూడా మన వద్దలేదు. ఆయన మనకు, మన



అవసరాలకు తగినట్లు తన గుణ సంపదను ప్రసాదించే మార్గం, దాన్ని తెలుసుకునే మార్గాన్ని చూయించాడు. ఆయనతో మన సంబంధా బాంధ వ్యాలు ఎలా ఉండాలో తెలిపే మార్గాన్ని సమకూర్చాడు. అది మనపై ఉన్నా ఆయన కరుణాకటాక్షాలు, రుణభారం. ఆ గుణగణాలను మనకు ఎరుక పర్చడానికి గల కారణం, మనం ఆయనతో మన సంబంధాన్ని ఎలా పటిష్ట పర్చుకోగలమన్నదే. కేవలం నోటితో ఆయన గుణవిశేషణాలను వల్లెవేయడం, భజించడం కాదు. ఆయన పరిపూర్ణ వ్యక్తిత్వ ఇచ్ఛకు, ఇష్టానికి మనలను మనం పూర్తిగా అర్పించుకోవడానికే.

ఏ దైవం అయితే మనకు యదార్థమైన పాలకుడో ఆయన పాలన అవసరం మనకేమిటి? ఆయన ఆ పదవికి అర్హుడు ఎలా అయ్యాడు? అన్న విషయాన్ని మనం ఇప్పుడు ఆలోచించాల్సివుంది.

పనిలో పనిగా నా మాటల వైపుకు దృష్టి మళ్ళించే నా ముస్లిమేతర సోదరులకు కూడా నేనో విషయం చెప్పదలచుకున్నాను. మీరు కూడా కొంత ఆలోచించి చూడండి! మానవునిలో ఓ సూక్ష్మమైన విశ్వాసమే దాగుంది. ఇన్ని మహోన్నత సామర్థ్యాలను కలిగి ఉన్న మనిషి తనలో దాగున్న అనేకానేక సామర్థ్యాలను ఇంకా గుర్తించనే లేదు. అనేక విశ్వ రహస్యాలను కనుగొన్న ఈ మానవుడు విశ్వరహస్యాలెన్నింటినో లోబరుచుకున్నవాడే. నీటిలో చేపకంటే మెరుగ్గా ఈదగలడు. గాలిలో పక్షికంటే కూడా మెరుగ్గా ఎగురగలడు. చంద్రునిపై జెండా కూడా పాతాడు. ఇప్పుడు అంగారక గ్రహం (Mars) వరకూ వెళ్ళే ప్రయత్నంలో ఉన్నాడు. ఇలాంటి మానవునిపై ఎవరి పెత్తనం అవసరం లేదా? ఓ సాధారణ జ్ఞానంగల మనిషి కూడా ఠక్కున చెప్పేస్తాడు. అవును! మనిషిపై అతనికంటే అధికమైన జ్ఞానంగలవాడి పెత్తనమే ఉండా లని. అలాగే ఆ అనంతమైన విజ్ఞాన సంపదగల వాడు ఈ మనిషి కంటే వివేకవంతుడై ఉండాలి, నిష్పక్షపాతి, ఏ తెగకూ జాతికి చెందనివాడు, జాతీయ వాదానికి అతీతుడై ఉండాలని; అతనిలో పగ తీర్చుకునే లేదా అసహించుకునే భావనంటూ ఉండకూడదని, అతను రేపటి భవిష్యత్తును కూడా ఈ రోజునే తెలుసుకోగలవాడై ఉండాలి. ఇలాంటి సుగుణాలు ఎవరిలో ఉన్నాయో

చెప్పండి? పీర్ ముర్షిద్‌లలోనా? బోనాలు స్వాముల్లోనా, ఫకీరుల్లోనా, పోపు లేదా చక్రవర్తుల్లోనా? ఏ ముస్సోలిని లేదా హిట్లరులోనా? లేదా ప్రజా మెజారిటీలోనా? వీరెవరిలోనైనా ఈ సుగుణాలు మీకు అగుపడుతున్నాయా? ఈ సుగుణాల లేని వ్యక్తిని పాలకునిగా ఎంచి అతనిని విధేయించడం మానవ ఔన్నత్యాన్ని మట్టిపాలు చేయడం కాదా? ఇలా ఈ మానవ ఔన్నత్యాన్ని ఓ గ్రుడ్డివాని చేతికిచ్చేసి వినాశనానికి గురికాదలచుకున్నారా? ఇలాంటి మహోన్నతమైన విజ్ఞాన విలువలుగల మనిషిపై అలాంటి బలహీనతలకు అతీమైన శక్తిగలవాడికే అధికారం చెలాయించే హక్కు ఉంది. అలాంటి శక్తి గలవాడే తాను అనుకున్నది చేస్తాడు. ఆ పనికి ఎవరికీ జవాబుదారు కూడా కాకుండా ఉంటాడు.

ఆయనే సకల స్తోత్రాలకు అర్హుడు, పవిత్రుడు, పరిశుద్ధుడూను. మిమ్మల్ని పాలించే అధికారం ఆ పవిత్రత, స్తోత్రాలకు అర్హుడైన వానికే ఉంది. ఈ అధికారం మరింకెవరైనా పొందినట్లయితే అతను ప్రపంచానికే చేటుగా మారిపోగలడు.

సోదర మహాశయులారా! ఈ కారణం చేత ఇస్లామ్ దైవం ఇచ్చిన ఆదేశం ఏమిటంటే, మీ ధార్మిక భావోద్రేకాలు, మీ మతాచారాలు, మీ ఆరాధనా విధానాలు, మీ ధార్మిక జీవితం పూర్తిగా నాతోనే ముడిపడి ఉండాలి. మీకు పాలకుడిగాను, ప్రభువుగాను ఉండే హక్కు నాకొక్కనికే ఉంది. దాసోహం అనదగ్గ సామర్థ్యంగలవాడు ఈ విశ్వాంతరాళంలో నేను తప్ప ఇంకెవడూ లేడు. నాకు తప్ప మీరు ఎవరినైనా ప్రభువుగా తలిస్తే అది అన్యాయమే అవుతుంది. అలా చేసినట్లయితే మీరు సర్వనాశనం ఎలాగూ అయ్యేవారే, మీరు జీవించి ఉన్నంత కాలం ఈ ప్రపంచం ఓ నరకంగా మారిపోతుంది. అయితే ఈ యదార్థాన్ని తిరస్కరించిన ఫలితంగా మరణానంతరం మీరు శాశ్వతంగా నరకయాతనలకు గురియై పోతారు. ఇదీ ఇస్లామ్ దైవం ఇచ్చే ఆదేశం. ఇది మనస్సులో నాటుకుపోయేది, మనిషి నైజానికి సరిపోయే మాట. ఇది ఓ పామరుని లగాయత్తు 'ఐన్‌స్టీన్' లాంటి శాస్త్రవేత్తకు కూడా సునాయాసంగా అర్థమయ్యే మాట. ముఖ్యంగా దైవాన్ని నమ్మే ఆస్తికులు, వారు దైవాన్ని ఏ పేరుతో పిలిచినా సరే, నిరాకరించలేని నిజం ఇది.



నేను ఓ పల్లెటూరివాసిని. మా ఊరి ముస్లిమేతరులకు నేను ఎన్నో మార్లు నా ఇంటి గురించి అడిగి చూశాను. వారిని ప్రశ్నిస్తూ, నేనే ఈ ఇల్లు నిర్మించాను, మీరు దాన్ని నమ్ముతారా? అని. 'అవును' అని సమాధాన మిచ్చారు వారు. అయితే నేనీ ఇంటిని నిర్మించాను కాబట్టి దీనికి యజమాని ఎవరు? అని అడగ్గా, ''అదేమిటీ! మీరే గదా దీనికి యజమాని'' అని ఆశ్చర్యంగా బదులిచ్చారు. దానికి 'యజమానిని నేనే అయినప్పుడు ఈ ఇంటిపై పెత్తనం ఎవరిదై ఉండాలి?'' అని తిరిగి ప్రశ్నించాను. జవాబుగా 'మీ పెత్తనం కాకుండా మరెవరి పెత్తనం ఉంటుంది? అని అన్నారు. "సరే! ఈ ఇంటిపై నా పెత్తనం కాకుండా మరెవరిదో లేదా మీదో పెత్తనం నడుస్తుంటే నన్ను ఆ ఇంటికి యజమానిగా పిలువడం సరైన విషయమే నంటారా?'' అని అడిగాను. దానికి ప్రతి ఒక్కరూ 'అది సరైనది కాదు. అదెలా సాధ్యం, అలా కుదరదు'' అన్నారు. ఆ తరువాత నేను వారినుద్దేశించి, 'మీరు ఎవరినైతే పరమేశ్వరునిగా భావిస్తున్నారో, భావించడమే కాదు విశ్వసిస్తున్నారో, ఆయనే మిమ్మల్ని పుట్టించినవాడని, ఏదో ఓ రోజున మీరాయనకు సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని నమ్ముతున్నారో, ఆయన తప్ప ఈ ప్రపంచంలో ఇంకెవ్వరి పెత్తనం అయినా నడవవచ్చని అనుకుంటున్నారా?'' అని వారిని అడిగి చూశాను. అయితే ఈ భావంతో విశ్వసించిన వాడొక్కడూ నాకు లభించలేదు. ఈ సత్యాన్నే ఇస్లామ్ ధర్మం చాటి చెబుతుంది.

నా గ్రామం 'బైరసియా.' వాళ్ళు, నేను భోపాల్‌లో ఉంటున్నానని, నా వ్యవసాయం ఆ గ్రామంలోనే ఉందన్న విషయాన్ని ఎరుగుదురు. అక్కడ నాకు పొలాలున్నాయి. పశుసంపద, ఇల్లూ, వ్యవసాయానికి కావాల్సిన సకల హంగులూ ఉన్నాయి. బాల్యం నుండే ఓ అనాథగా ఉండే ఓ ముస్లిమేతరుడు నా దగ్గర ఉంటూ వస్తున్నాడు. అతనే బైరసియాలో నా పనులన్నిటిని చక్కదిద్దుతూ ఉన్నాడు. అంటే అతనక్కడ నా స్థానాన్ని ఆక్రమించాడన్నమాట. మరో విధంగా చెప్పాలంటే, అతను నాకు ఖలీఫా. అంటే ప్రతినిధి. అతని పనల్లా నా ఇష్టప్రకారం నడుచుకోవడం. అతనలా మసులుకుంటున్నాడు కూడా. అతను బాల్యం నుండే నా వద్ద పెరిగి పెద్దవాడైనందున నేనంటే అతనికి అత్యంత ప్రేమ. ఈ పరిస్థితులలో నేను భోపాల్‌లో ఉంటున్నందున

నాపట్ల ప్రేమాభిమానాలను ప్రదర్శిస్తూ, ప్రతిరోజూ కొన్నిసార్లు భోపాల్ వైపుకు ముఖం త్రిప్పి సాష్టాంగపడడం లేదా రమజాను, బక్రీదు పండగలకు నా దగ్గరకు వచ్చి శుభాకాంక్షలు మాత్రమే చెబుతూ నా ఆస్తిని తన ఇష్టమొచ్చిన రీతిలో ఖర్చు బెడుతూ తన ఇష్టానుసారంగా నడుచుకుంటే అతణ్ణి మీరే మంటారు? ఇలాంటి పరిస్థితిలో అతను నాకు ఖలీఫా లేదా ప్రతినిధిగా చెలామణి అవుతాడా? మీరే చెప్పండి! పోనీ, మన ఊరివారందరీ నడుమ ఎంతో సమైక్యత ఉంది కాబట్టి మనమందరం కలిసి ప్రభుత్వం నిర్దేశించిన చట్టాలన్నిటినీ అనుసరిస్తూ టాక్సులు, పన్నులు మనమే వసూలు చేసి ఆ ప్రభుత్వం చూపిన మార్గాల్లోనే ఖర్చు పెడుతున్నామనుకోండి. ఈ విషయంలో ప్రభుత్వంతో ఎలాంటి సంబంధమూ, పెట్టుకోలేదనుకోండి. అలాంటప్పుడు ఏ ప్రభుత్వమైన మన ఈ స్వతంత్ర పోకడను సహిస్తుందా? అలా ఎన్నిటికీ జరుగదు. మనపై తిరుగుబాటు ఆరోపణ కేసువేస్తుంది. ఈ నిజాన్ని తెలుసు కోవడానికి గొప్ప తత్వజ్ఞానం ఏదీ అవసరం లేదు. మనమిలా ప్రభుత్వం నియమించిన అధికార్లకంటే ఎంత మెరుగ్గా దాన్ని నిర్వహించినా సరే దాన్ని ఏ ప్రభుత్వం సహించబోదు. అలాగే, భార్యాభర్తల సంబంధం కూడాను. ఏ భార్య అయినా తన భర్త పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండి, అతనే సర్వస్వం అని అనుకుంటూనే ఇంటి పెత్తనమంతా తన చేతుల్లోనికి తీసుకోవడం లేదా ఈ బాధ్యతను పొరుగువాడు నిర్వహించడం, లేదా ఆ వీధిలో ఉన్న మహిళలందరూ కలిసి తమ తమ ఇళ్లలో భర్త పెత్తనం కాకుండా తమ సొంత పెత్తనమే చేలాయిస్తామని నిర్ణయించమంటే భర్తలంతా ఈ నిర్ణయాన్ని సహించి ఊరుకోగలరా? అలా ఊరుకుంటే వారు భర్తలుగా చెలామణి కాగలరా? కాబట్టి సోదర మహాశయులారా! ఈ వైఖరిని ఓ మామూలు రైతు కూడా సహించనప్పుడు, ప్రభుత్వమే సహించనప్పుడు ఆ దైవం ఎలా సహించ గలడంటారు? మీరే ఆలోచించండి! పుట్టించింది ఆ దైవమే, మీరు తిని బతికేది ఆయన ప్రసాదించినదే, మిమ్మల్ని పోషించేది కూడా ఆయనే అయినప్పుడు మీరు చేతులుచాచి మొక్కేదెవరిని? భక్తి పారవశ్యంతో సాష్టాంగపడేది ఎవరి ముందు?? మీపై పెత్తనమంతా చెలాయించబడు తున్నది దైవేతరులది లేదా స్వయంగా మీది లేదా మీరు ఎన్నుకున్న ప్రజా



ప్రతినిధులది. అయినా పరలోకంలో దైవం, మీరక్కడికి వెళ్ళగానే ఏ స్వర్గవరా లను అయితే ప్రసాదిస్తాడనే తలంపుతో ఉన్నారో ఆ స్వర్గం కేవలం ఒక్క సద్వచనం, 'లా ఇలాహ ఇల్లల్లాహ్' (అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడు) అనగానే ఆ స్వర్గాన్ని మీకు అప్పజెప్పేస్తాడనుకున్నారా? అలా పలికి నందుకు ఆయన మీకు రుణపడి ఉన్నాడనుకున్నారా? ఆయన్ను ఎవరూ గుర్తించలేదు గనక మీరే ఆయన్ను గుర్తించారనా? ఆయన్ను ఎవరు ఆరాధించలేదు గనక మీరే ఆయన్ను ఆరాధించారనా? మీరాయన ముందు సాష్టాంగం చేస్తున్నారు. ఆ సజ్దాల్లో మిమ్మల్ని మీరు పూర్తిగా ఆయనకు సమర్పించుకోవాలనే ఆ భావన ఇతరుల పట్ల కూడా ఉండి ఉంటే ఆయన మీ ఈ చర్యకు కృతజ్ఞత చూపాలా? ఓ బలహీనమైన ప్రభుత్వం కూడా ఈ వైఖరిని సహించనప్పుడు, ఆ సర్వోన్నతుడు, సర్వాధికారి అయిన అల్లాహ్ మాత్రం దీన్ని సహించి ఊరుకోవాలా? అదే విధంగా మీ జీవితాన్నంతా దైవేతరులకు అప్పజెప్పి కేవలం ఆయన ఎదుట సజ్దాలు చేస్తూ, ఆయన నామాన్నే జపిస్తూ ఉంటే ఆయన కారుణ్యం మీపై కురుస్తునే ఉంటుంది అని అనుకుంటున్నారా?

సోదరులారా! మీరే గనక నా ఈ మాటల్ని శ్రద్ధగా విన్నట్లయితే ఈ ద్వంద్వ వైఖరి 'తౌహీద్' (ఏకేశ్వరోపాసన)కు పొంతన లేని వైఖరి అని తెలుసుకోగలుగుతారు. మానవ నైజానికి సరిపోయే వైఖరి అయినా తౌహీద్ మిమ్మల్ని కోరేదల్లా, ఎవరైతే మనకు ఆరాధ్యుడో ఆయనే మన నిజప్రభువు కూడాను. ఆయన్నే మనం ఆరాధించాలి, విధేయించాలి కూడా. మన ఈ దాస్యభావన, సామూహిక అవసరాలు రెంటినీ ఒకే ఒక కేంద్రంతో ముడి పెట్టాల్సి ఉంటుంది. ఆరాధనలను విభజించి బహుదైవాలను ఆరాధించడం ఎంత షిర్కో, విధేయతను కూడా విభజించడం కూడా అంతే షిర్కు అని ధార్మిక గ్రంథాల్లో చెప్పడం జరిగిందో లేదో నేను చెప్పనుగాని, ఈ విభజన, అంటే ఆరాధనకు కేంద్రం ఒకటి, విధేయతకు కేంద్రంగా మరొకటిగా ఉండడమే షిర్కు (బహుదైవారాధన). ఇది అంతకంటే ప్రమాదకరమైనది. దాన్నే మనం షిర్కుగా భావించడం లేదు.

నేను ప్రారంభంలోనే చెప్పినట్లుగా, "ఆరాధన మాత్రం దైవానికే. ఫర్జు, సున్నత్, నఫిల్ ఆరాధనలన్నీ దైవాదేశం మేరకే జరగాలి, మిగిలిన ప్రాపంచిక

విషయాలు అంటే రాజకీయం, సామాజిక వ్యవహారాలు, ఆర్థిక విధానం, సామూహిక విషయంలో ఇతరులు నడిచే మార్గాన్నే అనుసరించ వచ్చు" అని చాలా మంది ధార్మికుల అభిప్రాయం. ఇది ఇహపరాలు రెండూ ఒక్కటే అనే భావనకు పూర్తిగా విరుద్ధమైన భావన.

వారు అనుకుంటున్నట్లు, ఇతరులు మరొకరి సార్వభౌమత్వాన్ని స్వీక రించిన విధంగా మనం కూడా వారి సార్వభౌమత్వాన్ని గుర్తించి ఇస్లామీయ రాజకీయ హక్కును నెరవేరుస్తున్నామని స్థిమిత పడిపోవడమే నిజమైతే, బిస్మిల్లాహ్ అంటూ కుడిచేత్తో సారాయిని సేవించడం కూడా సున్నత్ అనుసరణే అయ్యేది. ఇస్లామీయ రాజకీయంగానివ్వండి, ఇస్లామేతర రాజకీయంగా నివ్వండి ఆ రెంటికీ పునాది పడేది సార్వభౌమత్వాన్ని గుర్తించినప్పుడే. మొదటి మెట్టుగా ఆ సార్వభౌమత్వం ఎవరిది? అనే ప్రశ్నకు సమాధానం లభించాలి. ఈ సమాధానంలోనే ఇస్లామీయ రాజకీయం అంటే ఏమిటి? ఇతర రాజకీయం అంటే ఏమిటి? అన్న యదార్థం దాగుంది. పాలనా రూపురేఖలు ఎలా ఉండాలన్న దాన్ని గురించి ఇస్లామ్ అంతగా పట్టించుకోదు. సఖ్యత, ఆలోచనలకు సంబంధించిన విధానాలను రూపొందించేటప్పుడు, వాటిలో అసలు సార్వభౌముడు అల్లాహ్‌యే అని, పౌరులు కళ్ళెంలేని గుర్రాల్లా కాకుండా తమ యజమాని అయిన అల్లాహ్ అభీష్టం మేరకే నడుచుకోవడం, ఆయనకు ప్రతినిధులుగా మసలుకోవడం జరిగితే అది ఇస్లామీయ రాజకీయం అవుతుంది. దైవం కాకుండా మరింకెవరి సార్వభౌమత్వాన్నయినా గుర్తిస్తే అది ఇస్లామేతర రాజకీయమౌతుంది. దాన్ని ఆచరించేవారు 'చిల్లాలు' ఆచరించే 'అవులియా'లైనా, దివ్యగ్రంథం అయినా ఖుర్‌ఆన్‌ను చేతబట్టి తిరిగే 'ఉలమా'లైనాసరే. ఎందుకంటే, దైవారాధనలో ఇంకెవరినీ భాగస్వాము లుగా చేయడం 'షిర్క్' ఎలా అవుతుందో, ఆయన సార్వభౌమాధికారుల్లో మరొకరిని భాగస్వాములుగా చేయడం పూర్తిగా షిర్కు హద్దు మీరడం లాంటిది. **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** భావం అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడు అని. అలాగే **'లా మా బూద్ ఇల్లల్లాహ్'**కు భావం అల్లాహ్ తప్ప మరే ప్రభువు లేడు అన్నది. వాటిలో ఒకదాన్ని విశ్వసించకపోవడం తౌహీద్ భావనకు



వ్యతిరేకం. ఇది బుద్ధికందే విషయం కాదంటారా? అదే గనక షిర్కు అయితే ఇది జుల్మెఅజీం (తీవ్రమైన దౌర్జన్యం) అవుతుంది. **ఇన్నష్షిర్కలజుల్మున్ అజీమ్** అని దివ్యగ్రంథంలో చెప్పారు. ఈ తీవ్రమైన తప్పిదానికి అనుకోకుండా లేక కావాలని పాల్పడితే మీ ఆరాధనలు, మీ జపతపాలు, దైవం నెలకొల్పే త్రాసులో ఎంత బరువు తూగుతాయో చెప్పలేను. అల్లాహ్ అయితే పరమ దయాళువు, మన్నించి కరుణించేవాడు అని అనడంలో సందేహం లేదు. కాని ఎలాంటి ఆచరణ లేకుండా కేవలం ఉత్తుత్తి మాటలను చూసి తమను విశ్వాసపాత్రుల్లో చేర్చుకుంటాడు అని అనుకునే అమాయక ధార్మికుల్లాంటి అమాయకుడు కాడు దైవం. ఎవరినైనా స్నేహితునిగా చేసుకునే టప్పుడు అమాయకుడు కూడా అతని మాటల తీరును చూసే నమ్మడు. రకరకాలుగా పరీక్షించిగాని అతణ్ణి మిత్రునిగా చేసుకోడు.

ఇదండీ! 'తౌహీద్' అంటే ఏమిటి? అనే దానికి సమాధానం. అంటే, పుస్తకాలకు మట్టుకే పరిమితంగా చేసి సురక్షితంగా ఉంచడం. అల్లాహ్ సార్వభౌమత్వాన్ని వేరువేరుగా ఉంచి కేవలం మెదళ్ళకు, పుస్తకాలకు మట్టుకే పరిమితం చేసి సురక్షితంగా ఉంచకుండా ఆయన సార్వభౌమత్వాన్ని పూర్తిగా అమలుచేయడం అన్నమాట. దాని కార్యచరణ స్వరూపం మాత్రం మన దాస్యభావనను, మన సార్వభౌమత్వపు అవసరాలను ఇతరుల పెత్తనం నుండి వేరుచేసి ఆ రెంటిని ఒకే జబ్బార్, ఖహ్హార్; సుబ్బూహ, ఖుద్దూస్, రవూఫ్, రహీం అయిన అల్లాహ్‌కే అంకితం చేయడం. ఒకవేళ ఆ రెంటిని వేరుచేసినట్లయితే ఆ రెండు సుగుణాలు నిర్జీవంగా మారిపోతాయి. అల్లాహ్ సార్వభౌమత్వం ఎంత గొప్ప కారుణ్యమంటే, దాని శుభాలను మనం, ఇతర శుభాలను లెక్కించ శక్యం కానంత అనంతమైనవి. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)వారు ఏ దైవ సార్వభౌమత్వాన్నైతే గుర్తింపజేశారో ఆ సార్వ భౌమాధికారాలను ఒప్పింపజేయడానికే యుద్ధాలు, సంధులు, ఒప్పందాలు చేసుకున్నారు. ఇతర సార్వభౌముల ప్రతినిధులు చేసినట్లే ఆయన కూడా ఓ రాజాధికారిగా వాటన్నిటిని తమ ప్రత్యేక తీరులో ఎంతో పవిత్రత, పరి

శుద్ధతతోనే అమలుచేశారు. అలాంటప్పుడు ఆయనకు అధికారం చెలాయించే, అయిశ్వర్యాన్ని పొందే కోరికంటూ ఉందనా? అస్తగ్ఫిరుల్లాహ్! (దైవం క్షమించుగాక). మరైతే ఆయన ఇలా ఎందుకు చేసినట్లు?

పిల్లవాని శిక్షణ కేవలం ప్రేమ, ప్రోత్సాహాలతోనే జరగదు. దాని కోసం అప్పుడప్పుడు పిల్లవాణ్ణి దండించాల్సి వస్తుంది కూడా. ఈ యదార్థం ప్రతి ఒక్కడూ ఎరిగిందే. అచ్చం అలాగే ప్రతి ఆలోచనా వ్యవస్థ, కార్యాచరణ విధానం కూడా మనిషిని మానవునిగా తీర్చిదిద్దడానికి శక్తిని ఉపయోగిస్తుంది. ఇస్లామ్ చేసింది కూడా అదే. దైవానికి ఇష్టమైన మానవుల్ని తీర్చిదిద్దడానికి వారికి హితబోధ చేయడంతోపాటు శక్తిని కూడా ఉపయోగించాల్సి ఉంటుంది. ఆ శక్తి అనేది అల్లాహ్ సార్వభౌమాధికారం, ఆయన ప్రసన్నతతో ముడివడి ఉంటే, అది గొప్ప దైవకారుణ్యమే అనవచ్చు. ఆ శక్తే గనక దుర్మార్గుల చేతుల్లోకి వెళ్ళితే అది మానవ జాతికే గొప్ప శాపంగా మారి పోగలదు.

మహాప్రవక్త (స), ఆయన సహచరగణం (ర) గార్ల జీవితాలను అధ్యయనం చేస్తే మీకు తెలిసే విషయం ఏమిటంటే, ఒకవేళ మానవులకు సంబంధించిన ఓ వర్గం ఆ నిజమైన ఆరాధ్యుని దాస్యంలో నిమగ్నమై, ఆయన సార్వభౌమాధికారాలకు దాసులైపోతే, ఈ ప్రపంచంలో మరెక్కడా, మరే జీవన విధానంలో లభించని గౌరవోన్నతులు, ప్రశాంత వాతావరణం, శాంతియుతమైన జీవితం పొందారన్నది. దైవదాసుడై ఉండి విలువను కోల్పోవడమా? దైవదాసుడై ఉండి మరొకరికి బానిస కావడమా? నిస్సహాయుడై ఉండడమా? ఇది సాధ్యమయ్యే విషయమేనా?

మనమంతా పూర్తి సంతృప్తితో ఆయనకే దాసులైపోతే మన ఈ పరిస్థితి అతి శీఘ్రంగా మారిపోగలదు. నేడు మీరు న్యాయం కోసం అర్రులు జాస్తున్నారు. అది మీకు లభించడం లేదు. రేపు ఆ న్యాయం మీ ద్వారానే ఇతరులకు లభించగలదు. నేడు మీరు మీ గోడును ఒకరి ముందు వెళ్ళబోసుకుంటున్నారు, అయినా మీ గోడును వినే నాథుడే కరువయ్యాడు. రేపు ప్రజలు మిమ్మల్నే ప్రాధేయపడే సమయం రానుంది. ఈనాడు మీకు ఓ



పద్ధతంటూ లేదు. రేపు ప్రజలు మీ మార్గాన్నే అనుసరిస్తారు. నేడు మీరు దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు, ఒకరి ముందు చేతులుజాపి అర్థిస్తున్నారు. రేపు మీరే దాతలుగా మారిపోగలరు. నేడు మీ సమయమంతా, మీపై వచ్చిపడే ఆపదల్లో ఏది చిన్నది మరేది పెద్దది అని లెక్కించడంలోనే గడిచిపోతోంది. రేపు ప్రజలపై వచ్చిపడే ఆపదల్ని మీరే దూరం చేసే స్థితిలో ఉంటారు. మీ తల దైవం ఎదుటే వంగుతుంది. ప్రజల హృదయాలు మాత్రం మీ ముందు వంగిపోతాయి. ప్రపంచ ప్రజలు నేడు నియంతృత్వపరుల, దౌర్జన్య పరుల ఎదుటే వంగి దండాలు పెడుతున్నారు. రేపు వారి మనస్సులు మీ వైపునకు మొగ్గడం కేవలం దైవమార్గదర్శకత్వం కారణంగానే జరుగుతుంది.

ఇది వరకు ప్రజల హృదయాలు ఎవరి ముందైతే వంగేవో దానిరుచి, వాటిని వంచే వారికే దక్కేది. ఇప్పుడలా కాదు, ఆ రుచిని ఆస్వాదించేది వారి హృదయాలను అల్లాహ్ వైపుకు మొగ్గేటట్లు చేసేవారే. అందుకే వీరు ఎక్కడికైతే వెళ్ళారో, ఏ దేశంలోనైతే కాలిడారో, అక్కడి ప్రజల లోకమే మారిపోయింది. వారి విలువలూ మారిపోయాయి. వారి ఇష్టాయిష్టాల కొలతలూ మారిపోయాయి. వారి భాష, నాగరికత, వారి సామాజిక వ్యవహా రాలన్నీ మారిపోయాయి.

సిద్ధాంతాలు కానివ్వండి, రాచరికాలు కానివ్వండి, రాచరిక వ్యవస్థ లేదా ఆర్థిక, సామాజిక వ్యవస్థలు కానివ్వండి వాటి వేళ్ళు శరీరాల్లో, మరీ చెప్పాలంటే మెదళ్ళలోనే నాటుకుపోయాయి. అయితే హృదయాల్లోనికి దిగి అక్కడ వేళ్ళూనుకునేటట్లు చేసే శక్తి మాత్రం ఏకేశ్వరవాదానికి, దాని ద్వారా ఉద్భవించే విలువలు, సిద్ధాంతాలకే ఉంది. ఈ గర్వకారణం ఏదో ఒక్క జాతీయమైనది లేదా మతపరమైనదేమీ కాదు. మనిషి 'స్వాభిమానం' అనే కళ్ళద్దాలను తీసి యదార్థ దృష్టితో గనక చూసినట్లయితే, ఇది ఏదో జీర్ణావస్థకు చెందిన విశ్వాసం కాకుండా మానవ నైజానికి పూర్తిగా సరిపోయే విశ్వాసం, అతని అంతరాత్మ ఘోషకు సమాధానమని గుర్తించగలడు. కాబట్టే ప్రపంచం దాని ముందు మోకరిల్లడానికి సిద్ధంగా ఉంది. అయితే కావలసినది ఏకేశ్వరో

పాసకుల పట్ల ఈ విశ్వాసం ఓ పిచ్చిగా మారిపోవడం. ఈ పిచ్చి వారి మేధను పూర్తిగా మార్చేసినప్పుడు, కరవాలాలకు వారి తలలు ఎగిరిపడు తున్నప్పుడు కూడా వారినోట **'ఫుజ్తు బిరబ్బిల్ కాబా'** (కాబా గృహం ప్రభువు సాక్షిగా నేను కృతార్థుడనయ్యాను) అనే మాటలు వెలువడుతుంటాయి. చూసేవారు, **"గర్ర హౌఉలాయి దీనుహుం"** (వారి ధర్మం వారిని పిచ్చివారిగా చేసేసింది) అని అంటారు.

అల్లాహ్ దైవత్వం, ఆయన సార్వభౌమత్వం రెంటినీ పరస్పరం కలుపుతూ, తమ ఆరాధనలను, విధేయతలను ఒకదాని కొకటి అనుసంధానం చేస్తూ నడిచేవారు, నడిపించే వారి వర్గాన్నే 'జమాఅతె ఇస్లామీ' అని పేరు పెట్టారు. ఆ వర్గానికే ఆ పేరు బాగా నచ్చుతుంది.

చివరగా ఓ మాట! ఇహపర ఈ రెండింటికి మధ్య సంబంధం ఆత్మ, శరీరం లాంటిది. ఆత్మను శరీరం నుండి వేరు చేస్తే అది ఎగిరిపోతుంది. ఇక మిగిలిపోయేది శరీరం మాత్రమే. అది కుళ్ళి కృశించి నశించిపోవడం తథ్యం. ఇది మనందరికి తెలిసిన విషయమే. ఇప్పుడు ఎవరి చేతుల్లోనైతే నాయకత్వపు పగ్గాలున్నాయో, మరెవరైతే ఆలోచనా, సైద్ధాంతిక నాయకత్వాన్ని కలిగి ఉండి ప్రపంచాన్ని నడిపిస్తున్నారో, అలాంటి వారిలో ఇప్పుడిప్పుడే జ్ఞానోదయం అయి, ఓ కొత్త తృష్ణ, కొత్త కోరికలు జనిస్తున్నాయి. వారిప్పుడు స్వయంగా ఆలోచించే విషయం ఏమిటంటే, 'మనం దేవుడే లేడని భావించడం లేదా ఉన్నాడని అనుకున్నా ఆయన అవసరం లేకుండా స్వతంత్రం జీవితపు ఏ పంథానైతే అవలంబించామో అది మనలను మృత్యు కుహరం ఒడ్డుకు చేర్చేసింది, ఇక ముందున్నది మనం తవ్వుకున్న అగ్ని గుండమే, అక్కడి నుండి వెనక్కు మరలడం కష్టతరమైనది, ఇక ఎటువైపుకు వెళ్ళాలో అర్థం కావడం లేదని'' తలపోస్తున్నారు. ఈ జ్ఞానోదయం వారిలో ఓ కొత్త తృష్ణను, ఓ కొత్త కోరికను జనింపజేస్తోంది. ఇలాంటి పరిస్థితిలో స్వచ్ఛమైన తౌహీద్ ధ్వజవాహకులు ఆలోచించవలసిందల్లా, దైవం ఇలాంటి అవకాశాలను శతాబ్దాల తరువాతగాని కల్పించడు, ఆ అవకాశం మీకిప్పుడు వచ్చింది కాబట్టి మీ ఆలోచనా విధానాన్ని ప్రపంచం ముందుంచమని వీరు ఈ



విషయాన్ని బాగా గుర్తుంచి మసులుకోవాలి.

**రబ్బనా తఖబ్బల్ మిన్నా ఇన్నక అంతస్సమీఉల్ అలీం.**
**వతుబ్ అలైనా ఇన్నక అంత తవ్వాబుర్రహీం.**

## అల్లాహ్‌యే ఏకైక సార్వభౌముడు

''ఆదేశాలనిచ్చే అధికారం పూర్తిగా అల్లాహ్‌దే. ఆయన ఆదేశాన్ని పెంచే లేదా తగ్గించే హక్కు ఏ మానవ మాత్రునికి లేదు. ఆ ఆదేశాలు ఆయన వివేకంతో నిర్దేశించాడు. కాబట్టి విశ్వాసి అవి సరైనవని, వివేకంతో కూడుకున్నవని తలుస్తూ మాత్రమే వాటికి అనుగుణంగా నడుచుకోవాలి. అయితే అలా జరగలేదు. వాటిని విధేయించడం జరుగుతూ ఉన్నది కేవలం అది దైవాదేశం అనే భావంతోనే. వేటినైతే ఆయన 'హరామ్' చేశాడో అవి హరాం (నిషిద్ధం) అయ్యాయి. మరి వేటినైతే ఆయన హలాల్ చేశాడో అవి కూడా మరే కారణాల వల్ల కాకుండా ఆయన హలాల్ (ధర్మసమ్మతం) చేసినందుకే హలాల్ అయ్యాయి.

ఎందుకంటే, ఏ దైవం అయితే వీటన్నింటికి యజమానో ఆయనే తన దాసులకు వాటిని ఉపయోగించే అనుమతినిచ్చాడు. కాబట్టి వాటిని హరామ్, హలాల్‌గా తలచడం కంటే మరే కారణాలను వెదికే అవసరం ఏర్పడదు. అలాగే ఓపని ధర్మసమ్మతం, నిషిద్ధం అన్నది కూడా. ఆయన వాటిని ధర్మసమ్మతం లేదా నిషిద్ధం చేశాడు అనే భావన తప్ప మరే భావన ఉండడానికి వీల్లేదు.'' *(తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ సంపుటం-1)*

-: సమాప్తం :-